# కథావేదిక

ప్రతినెలా వైవిధ్యంగల కథలను అందిస్తూ కథాప్రియులకు వెతుక్కునే పనిలేకుండా కథలన్నీ ఒకచోట చేర్చి, కత్తిరించి పొందుపరచుకుంటే చక్కని కథల సంకలనంలా మారి, మంచి కథను మళ్లీ మళ్లీ చదువుకునే చక్కని అవకాశాన్ని పాఠకులకు కలిగించే వినూత్న ప్రక్రియ... ఈ కథావేదిక.

## కేశకిరీటం

గుజ్జుల వెంకట కృష్ణారెడ్డి

''అబ్బా.. అబ్బబ్బ! ఎండలు మండిపోతున్నాయి. సూర్యభగవానుడు జనంపై కక్షకట్టి మరీ మాడ్చేస్తున్నాడు. వామ్మో! ఇక ఓజోన్ పొర తొలగితే అందరు మాడి మసైపోతారు'' తనలో తను మాట్లాడుతు బస్టాండ్‌లోని చెట్టునీడన చేరాడు పరబ్రహ్మం. ఖండువాతో చేటంత ముఖానికి పట్టిన స్వేదబిందువులను తుడుచుకుంటు గొణుక్కుంటున్నాడు. ''ఛస్! ఈ బట్టతలవల్లే ఆ సూర్యకిరణాలు గ్రుచ్చి గ్రుచ్చి చంపుతున్నాయి.''

అదే చెట్టు నీడన ఓ హీరోలాంటి శాల్తీ పరబ్రహ్మం ప్రక్కన చేరాడు. ''అబ్బ! ఏం ఎండ్రా బాబు, చెమటకంపుతో చచ్చిపోతున్నాం.'' కర్చీఫ్‌తో ముఖం తుడుచుకుంటూ గొణుక్కుంటున్నాడు.

పరబ్రహ్మం మెల్లిగా హీరోగారివైపు తిరిగి ''ఏం బాబు. హిప్పీ జుట్టు పెట్టుకుని (అతనిది మామూలు సైజు క్రాఫ్, కాని పరబ్రహ్మంగారికి గోరంతలు కొండంతలుగా, అదీ వెంట్రుకల విషయంలో ఊహించుకోవడం అలవాటు) ఎండవేడికి తట్టుకోలేనంటే, ఇక మాలాంటోల్ల సంగతి ఎవరికి చెప్పుకోవాలి.'' అంటు జాలిగా ఫేస్ పెట్టాడు.

''మీకేంటండి హాయిగా విగ్గు పెట్టుకుంటే సరిపోతుంది. అదే టోపీలాగా పనిచేస్తుంది. అందానికి అందం, గుండుకి చల్లదనం పైగా విగ్గువుంటే చెమట కంపు కొట్టదు! భలే అదృష్టవంతులండి మేష్టారు'' అన్నాడు హీరో.

బట్టతలతో బాధపడుతున్న పరబ్రహ్మంగారికి, ఇదేదో సమంజసంగానే వుందనిపించి, ''ఏమోయ్, కేశకిరీటం (విగ్గు) పెట్టుకుంటే దురదపుట్టదం బావా!''

''దురదపెడితే (సుతారంగా) ఓ చేత్తో విగ్గు ఎత్తిపట్టి హాయిగా మరోచేత్తో గోక్కోవచ్చు. మాకెక్కడిదండి. అంతటి అదృష్టం'' ఆదోరకంగా నవ్వుతూ అన్నాడు హీరో.

ఇదేదో కరక్టేనని అనిపించినా-- ''ఆ! నీకేంటీ, తల నిండా అంత పెద్ద జుట్టు హాయిగా పెంచుకుని, ఉచిత సలహాలు బాగానే ఇస్తున్నావు. నీతలపై అంత జుట్టు ఎలా పెంచావో చెప్పవోయ్?'' కుతూహలంగా అడిగాడు పరబ్రహ్మం.

''ఏముందండి! ఉద్యోగాల వేటలోపడి జుట్టు సంగతే మర్చిపోయాను'' చెప్పాడు హీరో.

''ఆహా! ఎంత అదృష్టవంతుడివోయ్!'' పరబ్రహ్మం ఫేస్ ఇంక్లూడింగ్ బట్టతల, మెర్క్యూరి లైటులా వెలిగింది. ''అసలు నాకు తొందరగా ఉద్యోగం దొరికినందుకే, ఇలా అఘోరించాను. ఆఫీస్‌లో పనివత్తిడి తట్టుకోలేక, ఆలోచించి-- చించీ, ఉన్న వెంట్రుకలు కాస్తా వూడిపోతున్నాయి. ఛస్! అనవసరంగా తొందరపడి చేరాను ఉద్యోగంలో, ఇతనిలాగే నిరుద్యోగినైతే, ఎంచక్క హీరోలా బస్‌స్టాండ్‌లో అమ్మాయిలకు బీటేసుకుంటు నుంచునేవాన్ని'' అంటు ఊహా ప్రపంచంలో విహరిస్తున్నాడు.





## ఓవర్‌టైమ్

''ఆఫీసులో పని చెయ్యకుండా టైపిస్ట్ ఉషాని ప్రేమిస్తున్నావట నిజమేనా?'' అడిగాడు ఆఫీసర్ శేఖర్‌ని.

''లేదుసార్! నేను ఓవర్‌టైమ్ చేసేటప్పుడు ప్రేమిస్తున్నాను.'' బదులిచ్చాడు శేఖర్.

## ఆత్మహత్య

''ఉషా! నీ ప్రేమ దక్కకపోతే ఈ చెరువులోపడి ఆత్మహత్య చేసుకుంటాను'' అన్నాడు శేఖర్ విచారంగా పోజుపెడుతూ.

''ఏడ్చినట్టేవుంది, ఈ చెరువులో నీళ్ళుంటే గదా!'' అంది ఉషా వెక్కిరిస్తూ.

''మరేం ఫర్వాలేదు చెరువు నిండేవరకు నేను ఆగగలను'' అన్నాడు శేఖర్.

## తొక్కపూజ

''అరటిపండు తొక్క పూజగదిలో పెట్టి పూజ చేస్తున్నావ్, నీకేమైనా పిచ్చా?'' అడిగింది నిర్మల రాధను.

''మరి ఇదేకదా మా అత్తగారి కాలు విరిగి పెత్తనం చెయ్యకుండా మంచం మీద పడుకోబెట్టింది'' సంతోషంతో చెప్పింది రాధ.

## సంగీతం

''మీరు చాలా అద్భుతంగా పాడతారట'' సుమని అడిగాడు చంద్రం.

''నిజమేనండి నా సంగీతం వింటూ పరవశంతో కళ్ళు మూసిన వాళ్ళెవరూ మళ్ళీ కళ్ళు తెరవరు'' సిగ్గుపడ్తూ చెప్పింది.

- చందూవంశీ (నంద్యాల)

''ఏంటి మేష్టారు, ఏదో ఆలోచిస్తున్నారు?'' అన్నాడు హీరో.

''ఆ! ఏం లేదయ్యా, నాకూ కాస్తో, కూస్తో జుట్టు వుండేది. రోజు రోజుకి పల్చబడుతుందన్న బెంగతో బాధపడ్తుంటే, ఇదే బస్‌స్టాండ్‌లో, నెల రోజులక్రితం ఓ నూనె సీసా ఐదువందల రూపాయలిచ్చి, ప్రతిరాత్రి తలకు బాగా పట్టించండి, నెలరోజుల్లో దువ్వెనకు చిక్కనంత ఒత్తుగా జుట్టు మొలుస్తుందని చెప్పాడో వెధవ!'' మనసులోని బాధను చెప్పుకున్నాడు పరబ్రహ్మాం.

''అయ్యో పాపం! అలాగా.'' హీరోగారి ఆశ్చర్యం.

''జుట్టు పెరగటం మాట దేవుడెరుగు. కొద్దిరోజులకు వున్న కాసిన్ని వెంట్రుకలు నేలరాలిపోయాయి. అప్పటి నుండి, ఇదిగో ఆ మృగం పుణ్యమా అని, ఈ మృదంగరూపం దాల్చాను'' బట్టతలను హీరోగారికి చూపెడ్తూ భావురుమన్నాడు.

పరబ్రహ్మాం ఫేస్ చూస్తుంటే, హీరోగారికి నవ్వాగలేదు. ''హీ.. హీ.. హీ... పళ్ళు బిగబట్టి నవ్వుతూ, అరెరె... అలాగా పాపం!'' సానుభూతిగా ''ఒకందుకు మీకతను మేలే చేశాడండి'' హీరోగారి ఓదార్పు ప్రయత్నం.


'మేలేంటి మేలు! నా కొలీగ్స్ అందరూ, వాళ్ళ వాళ్ళ చేతి దురద తీర్చుకోడానికి, రోజు లంచ్ టైంలో నా తలపై మృదంగనాదాలు మ్రోగిస్తున్నారు. బాబ్బాబు! బాధ భరించలేకపోతున్నాను'' ఏడుపు ముఖం పెట్టాడు, పరబ్రహ్మాం.

ఈసారి హీరోగారికి నిజంగానే అతనిపై జాలేసి, ''మేష్టారు, ఆ ఒక్క బాధ తప్పితే, మీకెన్నో లాభాలండి'' అన్నాడు.

''లాభాలా!'' నోరెళ్ళబెట్టాడు పరబ్రహ్మాం.

బట్టతలవల్ల లాభాల లిస్టు మొదలెట్టాడు హీరో. ''కడుక్కోవడానికి కావలసినంత ముఖం, తుండుగుడ్డతో తుడుచుకునేప్పుడు ఎనలేని సుఖం. తల దువ్వుకునే అవసరంలేదు కాబట్టి, నూనె, దువ్వెన ఖర్చు ఆదా. పైగా తలంటుకోవడం సులభం. పేను గొడవ అసలేవుండదు, చుండ్రు సంగతి సరేసరి. రకరకాల విగ్గులు వేసుకుని రోజు కో వేషం వెయ్యొచ్చు. క్రాఫ్ చేయించుకునే అవసరం వుండదు కాబట్టి, హాయిగా, అదే డబ్బుతో నెలకు సరిపడ టీపొడి కొనుక్కోవచ్చు. భర్తది బట్టతలైతే, భార్యలు ఎంచక్క వడలు, పూరీలు తలపై ఒత్తుతు ప్రేమగా మొట్టికాయలు మొట్టొచ్చు, ఇలా ఇంకెన్నో లాభాలు...!

''ఓహో! ఎన్ని ఉపయోగాలు!, ఛస్! అంతేనంటావా? అనవసరంగా ఇన్నాళ్ళు బట్టతలను ఆడిపోసుకున్నాను'' అంటు లాలనగా తల నిమురుకుంటున్న పరబ్రహ్మాం చేతికి ఏదో ఘనపదార్థం తగిలింది. చేతి వేళ్ళకంటిన కాకిరెట్టను చూసుకుని వికారంగా పెట్టాడు ఫేస్.




బట్టతలవల్ల లాభాలను వింటూ దీర్ఘాలోచనలోపడ్డాడు కామోసు, కాకిరెట్ట పడినట్లు గమనించలేకపోయాడు.

పరబ్రహ్మాం అవస్థను చూసి, హీరోగారు తన కర్చీఫ్‌తో తలపైని ఖరాబు పదార్థాన్ని నీట్‌గా తుడిచాడు.

''ఏం ఉపయోగాలో.. ఏం లాభాలో!, చూసావుగా నా అవస్థ'' విసుక్కున్నాడు పరబ్రహ్మాం.

''అన్నన్నా-! ఎంతమాట! బట్టతలవల్లే కదండి, కాకిరెట్టను నీట్‌గా తుడిచెయ్యగలిగాను'' పరబ్రహ్మాంగారిని ఓదార్చే ప్రయత్నం చేసాడు హీరో.

''ఏమోయి! నాతల అంటే నీకు వేళాకోళంగా వుందా?'' కోపంగా చూసాడు పరబ్రహ్మాం.

''మీరు మరోలా భావించకండి సార్! నా ఉద్దేశ్యం అదికాదు, ఇప్పుడు ఉదాహరణకు ఆ కాకిరెట్ట నా తలపైన పడిదనుకోండి, ఏం జరిగేది?''

''ఏం జరిగేది?'' అయోమయంగా చూసాడు పరబ్రహ్మాం.

''...''

''ఆ! ఏముంది నువ్వు ఇలాగే కర్చీఫ్‌తో తుడుచుకునేవాడివి...'' పెదవి విరిచాడు పరబ్రహ్మాం.

''అదే, అక్కడే మీరు బురదలో కాలేసారు'' అన్న హీరోను అదోలా చూసి తన కాళ్ళ వంక తేరిపారా ఓసారి చూసుకుని, నేను బురదలో కాళ్ళు వెయ్యడమేంటి అనే ఫీలింగ్ ఫేస్‌లో ఇచ్చాడు.

పరబ్రహ్మాంగారి ముఖకవళికలు గమనించి, ''అబ్బే! ఊరికే మాటవరసకన్నాను, నిజం చెప్పాలంటే, మీఅంత సులభంగా నేను తుడుచుకోలేను, వెంట్రుకల్లో ఆ పదార్థం చిక్కుకుపోయి, నానా ఇబ్బంది పెట్టేది, పైగా తలస్నానం చేస్తేగాని ఆ ఘనపదార్థం పూర్తిగా తొలగేది కాదు'' అంటు కన్విన్స్ చేశాడు హీరో.

''ఆమాట నిజమే-- ప్చ్!, ఈ సంగతి నాకు తట్టలేదు సుమా!'' పరబ్రహ్మాం ఫేస్‌లో చిరునవ్వు. కేశకిరీటం గురించి క్యూరియాసిటీ పెరిగి ''నాకెలాగైనా ఓ మాంచి కేశకిరీటం తెచ్చిపెట్టవోయ్, డబ్బులిస్తాను'' హీరో చెవిలో గుసగుసగా చెప్పాడు.

ఈసారి హీరో ఫేస్‌లో విజయగర్వం తొణికిసలాడింది. ''ఇప్పటికిప్పుడు మంచి విగ్గు దొరకాలంటే చాల కష్టమండి, కనీసం మూడు నెలల ముందు ఆర్డరిస్తేగాని ఒరిజినల్ విగ్గు దొరకదు'' అంటు నసిగాడు.

''బాబ్బాబు! అంతలా అనకు, బ్రహ్మాండమైన సలహా ఇచ్చావు. ఆ దివ్య కేశ కిరీటం సంగతి, కాస్త నువ్వే చూడు, చచ్చి నీ కడుపున పుడతాను'' ప్రాధేయపడ్డాడు పరబ్రహ్మాం.

''ఇంతగా మీరు చెబుతుంటే, మీకు సహాయం చెయ్యాలనేవుంది-- కాని ఎటొచ్చి--'' అర్థోక్తిలో ఆగిపోయాడు హీరో.

''సందేహించకు బాబు, డబ్బెంతైన ఫర్వాలేదు!''

హామీ ఇచ్చాడు పరబ్రహ్మం.

ఆ మాటకోసమే ఎదురుచూస్తున్న హీరోగారి మనసు సంతోషంతో పొంగిపోయింది. ''మేష్టారు, ఈరోజే మా బాబాయిగారికని మంచి ఇంపోర్టెడ్ విగ్గు తెప్పించాను, మిమ్మల్ని చూస్తుంటే నాకు జాలేస్తుంది. కాని ఇది చాల ఖరీదైన విగ్గ, దీని ధర షుమారు అయిదువేలు ఉంటుంది.'' ఇబ్బంది నటిస్తూ చెప్పాడు హీరో.

అంతవరకు ఉత్సాహంగావున్న పరబ్రహ్మం కేశకిరీటం రేటు వినగానే, గుండె కాస్త క్రిందకు జారినట్లనిపించింది. కాసేపటికి తేరుకుని ''డిస్కౌంటు ఏమన్నా వుందా బాబు?'' అనుమానంగా అడిగాడు.

''భలేవారండి మీరు, అసలే ఎండాకాలం, మంచి సీజన్ టైం, ఏదో మీరింతగా అడుగుతున్నారని ఒరిజినల్ ప్రైస్ చెప్పాను. పైగా ఇది ఇంటర్‌నేషనల్ విగ్గు. బ్లాక్‌లో అయితే ఏడువేల వరకు ధర పలుకుతుంది, ఇష్టమైతే చెప్పండి'' చాల క్యాజువల్‌గా అన్నాడు.

''వామ్మో! ఇంకాసేపాగితే ధర పెంచేట్టున్నాడు.'' మనసులో అనుకుని ''ఇందాకట్నుంచి ఒరిజినల్, ఒరిజినల్ అంటున్నావు, అంత ఒరిజినాలిటీ ఏముంది దాంట్లో?'' గట్టిగానే అన్నాడు పరబ్రహ్మం.

''ఒరిజినల్ విగ్గు అయితే అసలు సిసలైన మగవాడి వెంట్రుకలతో తయారవుతుంది. మీకు ఛీప్ విగ్గు కావాలంటే గుర్రపు వెంట్రుకలది తీసుకోండి. గాడిద వెంట్రుకలదైతే మరీ ఛీప్...'' వ్యంగ్యంగా అన్నాడు హీరో. పరబ్రహ్మం ఫేస్‌లో మగతనం తాలుకు అహంకారపు ఛాయలు ప్రస్ఫుటించాయి. గంభీరమైన పోజు పెట్టి, ప్రొద్దున ఆఫీస్‌లో తీసుకున్న హౌజ్‌లోన్ తాలుకు ఇన్‌స్టాల్‌మెంట్ డబ్బులోంచి, హీరోగారికి అయిదువేలు ముట్టజెప్పాడు. అటు ఇటు చూసి, కేశకిరీటాన్ని అతని చేతిలోంచి లాగేసుకున్నాడు.

లోన్ తీసుకున్నావు, పార్టీ ఇవ్వాలంటు వెంటబడ్డ కొలీగ్స్ నుంచి తప్పించుకోవాలని హాఫ్‌డే క్యాజువల్ లీవ్ పెట్టి, ఎవరికంటా పడకుండా, ఎంచక్కా బస్‌స్టాండ్‌కు వచ్చాడు పరబ్రహ్మం.

కేశకిరీటాన్ని అటు ఇటు త్రిప్పి చూసుకుని, తెగ సంబరపడిపోయాడు పరబ్రహ్మం. సెంటపర్సెంట్ మగవాడి వెంట్రుకలతో తయారైన కేశకిరీటం దొరికినందుకు, అతని ఆనందానికి అవధులు లేవు.

ఆదుర్దాగా కేశకిరీటాన్ని తలపై పెట్టుకుని, ''యాహూ! రేపట్నించి లంచ్ టైంలో నోమోర్ కొలీగ్స్ మృదంగం'' అనుకుని ఎగిరి గంతేశాడు.

ఆ వెర్రి ఆనందంలో, కేశకిరీటం వూడి ఆరడుగుల దూరంలో పడింది.

''భలేవారే మీరు! ఎలాగు విగ్గుంది కదా అని, ఇంత తల బిరుసుతనం పనికిరాదండి'' అంటు క్రిందపడ్డ విగ్గును సుతారంగా ఇరుప్రక్కల దులిపి, పరబ్రహ్మం తలపై సర్దిపెట్టాడు హీరో.

ఆ హఠాత్ పరిణామానికి, బుంగమూతిపెట్టి, ఓ చేత్తో కేశకిరీటాన్ని గట్టిగా పట్టుకున్నాడు పరబ్రహ్మం.

అప్పుడే వచ్చిన బస్సులోనికి దూరాలని ప్రయత్నిస్తున్న పరబ్రహ్మంగారికి చిరునవ్వుతో టాటా చెప్తూ, ''మేష్టారు, బస్సెక్కేప్పుడు విగ్గు జాగ్రత్త!'' హెచ్చరించాడు హీరో. విజయగర్వంతో వెనుదిరిగిన హీరోగారి నోట్లో పచ్చి వెలక్కాయ పడింది. హీరోగారి పాత ఇంటి ఓనర్ ప్రత్యక్షమై, ''ఆహా! అతనికి భలే టోపీ పెట్టావోయ్! టోపి పెట్టడం గురించి వినడమేగాని, నీ పుణ్యమా అని ప్రత్యేకంగా చూడగలిగాను.''

నీళ్ళు నములుతున్నాడు హీరో.

''అద్దె తాలుకు బాకీ డబ్బు రెండువేలు, అసలుపై వడ్డీ రెండువేలు, నీ చుట్టు త్రిప్పుకున్నందుకు దారి ఖర్చుల క్రింద ఒక వెయ్యి రూపాయలు, వెరసి మొత్తం అయిదువేలు, నీ చేతిలోని డబ్బు ఇలాగిచ్చెయ్యి, ఇచ్చెయ్యి.. ఇచ్చెయ్యి...'' అంటు చేయిచాచాడు ఆ వానర (ఓనర్).

గుటకలు మ్రింగుతు, దిక్కులు చూస్తూ, పారిపోయే ప్రయత్నాలు చేస్తున్న హీరోనుద్దేశించి, ''నీ వేషాలు నాదగ్గర కాదు, జుట్టు పట్టుకుని డబ్బుల్ వసూల్ చేస్తా, కబర్దార్ బేటా!'' అంటు హీరో జుట్టు గట్టిగా పట్టుకున్నాడు వానర (ఓనర్).

''ఇదేమి పట్టనట్టు, వానర (ఓనర్) చేతిలో విగ్గు మిగిల్చి, చలాకీగా పరుగు లంఘించాడు హీరో. చేతిలోని కేశకిరీటాన్ని చూస్తూ నోరెళ్ళబెట్టాడు వానర (ఓనర్).


అప్పులవాళ్ళ నుంచి తప్పించుకోవడానికి ఎంత బాగ సహకరించిందో ఈ కేశకిరీటం ముసిముసిగా నవ్వుకున్నాడు హీరో. పరబ్రహ్మానికి, లంచ్ టైంలో కొలీగ్స్ మృదంగనాదఘోష తప్పినా, సిటీబస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు కేశకిరీటాన్ని కాపాడుకోలేక నరకయాతన అనుభవిస్తున్నాడు. అప్పుడప్పుడు, బట్టతలే ఎంతో నయమన్న భావన అతనిలో కలుగుతుంది.

హీరోగారు మాత్రం దర్జాగా తలకు ఓ క్రొత్త కేశ కిరీటాన్ని తగిలించుకుని మరో బస్‌స్టాండ్‌లో జేరి, గుండుపై అక్కడక్కడ వెంట్రుకలు మిగిలిన శాల్తీకై వెతుకుతున్నాడు.

''ఈ నూనె వాడితే, దువ్వెనకు చిక్కనంత ఒత్తుగా జుట్టు మొలుస్తుందని'' ఓ శాల్తీతో చెబుతూ, ''ఇది ఇంపోర్టెడ్ నూనె, ధర కేవలం ఐదువందల రూపాయలే. త్వరగా తీసుకోండి ఇదే లాస్ట్ బాటిల్'' అంటు అంటగట్టాడు. పాపం ఆ శాల్తీకేం తెలుసు, ఓ నెల గడిచాక హీరో గారి దగ్గర కేశ కిరీటం కొనాల్సి వస్తుందని.

★

## బిజీ శ్రీకాంత్



ప్రస్తుతం ఇండస్ట్రీలో హీరోల పరిస్థితి చాలా దారుణంగా వుంది. ఫ్లాపులు వస్తే వెనుకబడడం, హిట్ వస్తే అవకాశాలు మరిన్ని రావడం వాళ్లకు సహజమైపోయింది. అయితే హిట్‌తో, ఫ్లాప్‌తో సంబంధం లేకుండా ఎప్పుడూ బిజీగా వుండే హీరో ప్రస్తుతం శ్రీకాంత్ ఒక్కడేనని చెబుతున్నారు ఇండస్ట్రీ జనం. అతడి సినిమాలు ఒకటి ఫ్లాప్ అయినా మరొకటి హిట్ కావడంతో, అందులోనూ అతడిమీద ఎలాంటి ఇమేజ్ లేకపోవడంతో ఎలాంటి పాత్రకయినా శ్రీకాంత్ సరిపోతాడనే పేరు రావడంతో, పైగా రెమ్యూనరేషన్ విషయంలో కూడా ఇబ్బంది పెట్టే ఆర్టిస్టు కాకపోవడంతో శ్రీకాంత్ డైరీ ఎప్పుడూ ఫుల్‌గా వుంటుందిట. ఇలాంటి హీరోలకు 'కీపిటప్ మైబోయ్' అని తప్ప మరేం అనలేం కదా!

-జె.వి.బాబు

